క్లుప్తంగా

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

రామగిరి(నల్లగొండ): కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బిహార్ పర్యటనలో భారత ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిని అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు ఆదివారం నల్లగొండ మండలంలో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. దీంతో నల్లగొండ మండల బీజేపీ అధ్యక్షుడు బోగరి అనిల్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకన్న, దళిత మోర్చా మండల అధ్యక్షుడు పోతెపాక శంకర్, పోతెపాక వెంకన్న, బొప్పని అంబేద్కర్, అంతటి యశ్వంత్ గౌడ్‌లను నల్లగొండ రూరల్ పోలీసులు ఆదివారం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మల్లేష్‌గౌడ్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మల్లేష్‌గౌడ్

చిట్యాల, నల్లగొండ టౌన్ : చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన సుంకరి మల్లేష్‌గౌడ్‌కు డాక్టరేట్ దక్కింది. యువజన విభాగం సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసినందుకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ అక్కుల రమేష్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్‌కు డాక్టరేట్ అందజేశారు. మల్లేష్‌గౌడ్ సుంకరి ఫౌండేషన్ ద్వారా విశేష సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన చిట్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా కొనసాగుతున్నారు. కార్యక్రమంలో న్యాయవాది ధ్యాన్ మోర్గాన్ కైట్ పాల్గొన్నారు.

కళ్లద్దాలు అందజేత



కళ్లద్దాలు అందజేస్తున్న నాయకులు

గట్టుప్పల్ : మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవతో సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గట్టుప్పల్ మండల కేంద్రంలో కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దండు యాదగిరి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, పట్టణ శాఖ అధ్యక్షుడు సామల యాదయ్య, దోర్నాల అంజయ్య, నామని గోపాల్, నామని బుచ్చయ్య, మహమ్మద్ అబ్బాస్, కొమిర స్వామి, ఇడం గణేశ్, పగిళ్ల జంగయ్య, పగిళ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న యువకులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పబ్బు దేవేందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్ పొందారు. అదేవిధంగా జనపాల కిషన్ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. వీరిని ఆదివారం ఆ గ్రామంలో ఓన్లీ మాస్ నో క్లాస్ వాట్సాప్ గ్రూపు సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మహంకాళి లింగస్వామి, నాతి మల్లేష్, అర్రూరి శ్రీశైలం, దేశబోయిన లింగస్వామి, నర్సింహ, గోలి మల్లేష్, ఖాజాపాషా, పల్లె మల్లేష్, బద్దం మల్లేష్, లింగస్వామి, నాగరాజు, గిరి, సుధీర్ పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న యూత్ ఫర్ సేవా సంఘం సభ్యులు

నల్లగొండ: నల్లగొండలోని శివరాంనగర్‌లో ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో ఆదివారం ట్యూషన్ పిల్లలకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్యూషన్ నిర్వాహకులు తేలు సైదులుయాదవ్, నీరజ, తోకోటి రమేష్‌చారి, సోమ నర్సయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు తగదు

మర్రిగూడ : ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ కమిషనరేట్‌కు వెళ్లనున్న ఆశా కార్యకర్తలను, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్యను ఆదివారం పోలీసులు ముందస్తు హౌస్ అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో సీఐటీయూ నాయకులు సల్వోజు రామలింగాచారి, మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, పద్మ, దుర్గమ్మ, తబిత, యాదమ్మ ఉన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణించేది ఎలా !



నకిరేకల్- మూసీ రోడ్డు దుస్థితి



మూసీ-నోముల శివారులో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

- అధ్వానంగా నకిరేకల్- మూసీ రోడ్డు
- గుంతల్లో నిలుస్తున్న వర్షపు నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నకిరేకల్ : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీటితో మూసీ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటిని కిందకు వదులుతుండడంతో పర్యాటకులు భారీ సంఖ్యలో ప్రాజెక్టు వద్దకు వస్తున్నారు. అయితే నకిరేకల్-మూసీ ప్రధాన రహదారి వర్షాలకు కోతకు గురై పలుచోట్ల గుంతలమయంగా మారింది. దీంతో మూసీ ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

12 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు

నకిరేకల్ నుంచి మూసీ ప్రాజెక్టు వరకు ఆర్అండ్‌బీ రోడ్డు 12 కిలోమీటర్ల మేర ఉంది. నకిరేకల్ మండలంలోని ఓగోడు, నడిగూడెం, వల్లభాపురం, నోముల, పాలెం గ్రామాల ప్రజలతోపాటు కేతేపల్లి మండలం గుడివాడ, సూర్యాపేట జిల్లాలోని రత్నపురం, రామచంద్రపల్లి, కుంచమర్తి, అర్వపల్లి నుంచి వాహనదారులు, ప్రజలు నిత్యం ఈ దారిగుండా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా మూసీ ప్రాజెక్టు ఉండడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు ఈ దారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిని పదేళ్ల క్రితం నకిరేకల్ నుంచి నోముల శివారు వరకు మూడు కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డుగా విస్తరించారు. మిగతా 9 కిలోమీటర్లు నోముల శివారు నుంచి మూసీ వరకు సింగిల్ రోడ్డుగానే ఉంది. నోముల శివారులో సింగిల్ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

నకిరేకల్ శివారులోని సువర్ణ గార్డెన్ సమీపం నుంచి నోముల గ్రామాల మధ్య సింగిల్ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ దారిలో ఉన్న గుంతల్లో ద్విచక్ర వాహనదారులు పడి ప్రమాదాలబారిన పడుతున్నారు. ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ప్రధానంగా మూసీరోడ్డుకు మరమ్మతులు చేయడంలో సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి డబుల్ రోడ్డుగా విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



గుంతలమయంగా మారిన నకిరేకల్-మూసీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలి. ప్రధానంగా నోముల శివారులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అందులో వర్షపు నీరు నిలిచి గుంతలు కనపడక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

–రావుల వెంకన్న బొప్పారం, నోముల

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



చండూరు : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తిప్పర్తి : ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ తిప్పర్తి మండల కేంద్రంలో ఆదివారం రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో వంగూరి రవి, గుండా వినయ్, మహేష్, రమేష్, బ్రహ్మచారి, సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : మోదీ మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బీజేపీ నాయకులు చండూరు చౌరస్తాలో ధర్నా నిర్వహించి, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ చండూరు మున్సిపల్ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్, బీజేపీ నాయకులు కోమటి వీరేశం, బూతరాజు శ్రీహరి, యాదగిరి, శ్రీను, ఆంజనేయులు, స్వామి, శంకర్, శ్రీధర్, శివ, శేఖర్, చంద్రమౌళి, విజయ్, సాగర్, రాము,నవీన్ పాల్గొన్నారు.

మర్రిగూడ : ప్రధానమంత్రి మోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి యాస అమరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాత్లావత్ రాజేందర్‌నాయక్, పందుల రాములుగౌడ్, వేనేపల్లి శ్రీనివాస్‌రావు, చాపల వెంకటేష్, రాకొండ ప్రదీప్‌రెడ్డి, నరసింహాచారి, మామిడి పరుశురాం, లింగస్వామి, పంగ యాదయ్య పాల్గొన్నారు.

బురద కుంటను తలపిస్తున్న పశు వైద్యశాల



బురదమయంగా మారిన పశువైద్యశాల ఆవరణ

మునుగోడు: నియోజకవర్గ కేంద్రంలోని పశు వైద్యశాల ఆవరణ బురద కుంటను తలపిస్తోంది. ఏ చిన్నపాటి వర్షం కురిసినా ఆస్పత్రి ఆవరణ అంతా బురదమయంగా మారుతోంది. అయినా వైద్యులు ఆ బురదలోనే పశువులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో గట్టి మొరం పోయించవచ్చు కదా అని వైద్యులను ప్రశ్నిస్తే.. తమకు నిధులు లేని కారణంగా మట్టి పోయించలేకపోతున్నామని చెబుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం



శాలిగౌరారం : రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు



చండూరు : ఆందోళన చేస్తున్న నాయకులు

శాలిగౌరారం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. ప్రజా సమస్యల అధ్యయన కార్యక్రమంలో భాగంగా ఇటీవల శాలిగౌరారం మండలంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ఊట్కూరు-బండమీదిగూడెం రోడ్డును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, మక్క బుచ్చిరాములు, డెంకెల లింగయ్య, గుండ్లపల్లి వెంకన్న, అన్నెబోయిన కిరణ్, గుండాల సత్యనారాయణ, బుర్రె సత్తయ్య, కప్పల నర్సింహ పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

తిప్పర్తి : మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు త్వరగా పూర్తి చేసి అర్హులైన వారందరికీ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా సమస్యలపై చేపడుతున్న పాదయాత్ర నాలుగోరోజు తిప్పర్తి మండల కేంద్రంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రలో సులబ్ కాంప్లెక్స్, మురికి కాలువలు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, భిక్షం, రాములు, వెంకన్న, లింగయ్య, జంజిరాల సైదులు, మంత్రాల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేయాలని ఆందోళన

చండూరు : మండలంలోని నెర్మట గ్రామం నుంచి పుల్లెంల గ్రామానికి వెళ్లే దారిని బీటీ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీపీఎం నాయకులు ఆదివారం ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ధనుంజయ్, స్వామి, వెంకటయ్య, శంకర్, యాదయ్య, సైదులు, వెంకన్న, నరసింహ, యాదయ్య పాల్గొన్నారు.

వాగు పారితేనే వరిసాగు..

- మునుగోడు మండలంలో తగ్గిన వరిసాగు
- ఆందోళనలో అన్నదాతలు



మునుగోడు వాగులో వట్టిపోయిన వ్యవసాయ బోరు

మునుగోడు: కేవలం వర్షాలే ఇక్కడి పంటల సాగుకు ఆధారం. పెద్ద వాగు పారితేనే ఇక్కడ వరిసాగు విస్తీర్ణం పెరుగుతుంది. కానీ రెండేళ్లుగా సరిగా వర్షాలు కురవక వాగు పారకపోవడంతో వరిసాగు విస్తీర్ణం తగ్గిపోయింది. దీంతో ఆ వాగు వెంట ఉన్న భూములు బీళ్లుగా మారిపోతున్నాయి. వరుణ దేవుడు జాలి చూపకపోవడంతో మునుగోడు మండలంలోని పెద్దవాగు ఒక్కసారైనా పారలేదు. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది.

కేవలం 4485 ఎకరాల్లో వరి సాగు..

మునుగోడు మండల వ్యాప్తంగా 29 గ్రామాలు ఉన్నాయి. మునుగోడు పెద్ద వాగు.. కిష్టాపురం, ఇప్పర్తి, కోతులారం, పలివెల, ఎల్లగూడెం, రావిగూడెం, చీకటిమామిడి, మునుగోడు, దుబ్బకాల్వ, కొరటికల్ గ్రామాల మీదుగా పారుతుంది. ఈ వాగు ఉన్న గ్రామాల్లో రైతులు కేవలం 15 నుంచి 20 అడుగుల లోతు బోరు తవ్వుకుంటే చాలు పుష్కలంగా నీరు లభిస్తుంది. ఒకమారు వాగు పారితే ఆరు నెలల పాటు పుష్కలంగా బోర్లు పోస్తాయి. అలా బోర్లు పోసిన సమయంలో ఆ వాగు వెంట గ్రామాల్లో రైతులు వరి పంట సాగు చేస్తారు. అయితే రెండేళ్లుగా వాగు పారకపోవడంతో బోర్లు ఎండిపోయి వాగుకు ఆనుకుని ఉన్న భూముల్లో రైతులు వరిసాగు చేయలేకపోయారు. ఈ ఏడాది కూడా వాగు పారకపోవడంతో 500 లకుపైగా బోర్లలో దాదాపు 400లకుపైగా బోర్లు ఎండిపోయాయి. మరికొన్ని నామమాత్రంగా నీళ్లు పోస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లోని రైతులు భూములు దున్నకుండానే బీళ్లుగా వదిలేశారు. గత ఏడాది దాదాపు 8700 ఎకరాల్లో వరి పంటను సాగుచేస్తే, ఈ ఏడాది కేవలం 4485 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అవి కూడా వాగు వెంట ఉన్న బోరు బావుల వద్ద కాకుండా రైతుల వ్యవసాయ భూముల్లో వందల అడుగుల లోతు వేసిన బోర్ల కింద సాగు చేశారు.

వరి పంట సాగు చేయలేకపోయా



నాకు వాగు వెంట మూడెకరాల పొలం ఉంది. రెండేళ్లుగా వాగు పారకపోవడంతో వరి పంట సాగుచేయలేకపోయా. ఈ ఏడాదైనా వాగు పారితే వరి పంటను సాగుచేసుకోవచ్చని ఆశపడ్డా. కానీ ఒకమారు కూడా వాగు పారకపోవడంతో పంట సాగుచేయలేకపోయా.

–అబ్బురబోయిన మల్లయ్య, మునుగోడు రైతు

రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి



చర్లగూడెం రిజర్వాయర్ పనులు పూర్తి చేయించి సాగు నీరు అందిస్తామని పాలకులు చెబుతున్నారు. కానీ నేటికీ ఆ పనులు 20 శాతం కూడా పూర్తిచేయలేదు. మునుగోడువాసుల గోడు తీర్చేందుకు ప్రభుత్వం చర్లగూడెం రిజర్వాయర్ పనులు పూర్తి చేయడంతో పాటు బివెల్లంల ఉదయసముద్రం నుంచి కిష్టాపురం చెరువులో నీరు నింపి సాగు నీరు అందించాలి.

–గుర్జ రామచంద్రం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు



నల్లగొండ : విద్యానగర్‌లో పూజలో పాల్గొన్న డీఎస్పీ తదితరులు



నల్లగొండ : బోయవాడలోని గంగపుత్ర సంఘం ఎదురుగా..

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ముషంపల్లి రోడ్డు ధాత్రినగర్ కాలనీలో వినాయకుడి మండపం వద్ద ఆదివారం అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. కాలనీకి చెందిన మేక లక్ష్మారెడ్డి-సుకన్య దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, ధాత్రినగర్, మధురానగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

మానస రెసిడెన్సీలో..

నల్లగొండ పట్టణంలోని మానస రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొద్దు శ్రీనివాస్‌రెడ్డి-అరుణ దంపతులు ఆదివారం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మద్దుల ఉపేందర్ రెడ్డి, సిలివేరు అమరేందర్, గీద రమేష్‌రెడ్డి, గీద సత్యనారాయణరెడ్డి, కొత్తూరు శ్రీనివాస్, విజయ్‌కుమార్, నర్రా ఆర్యన్‌రెడ్డి, మహేందర్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

శాంతినగర్‌లో భక్తులకు అన్నదానం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని 6వ వార్డు శాంతినగర్ కూరోళ్లబావి గణపతి విగ్రహం వద్ద ఐదో రోజు నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాలనీవాసులు సువర్ణ, సునీత, విజయ, మంజుల, మాధవి, విమల, రిషిత, మనీషా, హేమలత, పావని తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ : శాంతినగర్‌లో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



నల్లగొండ : ఫ్లైఓవర్ సమీపంలో శ్రీరాం యూత్ ఆధ్వర్యంలో..



నల్లగొండ పట్టణంలోని కంచర్ల టవర్స్ అపార్ట్‌మెంట్‌లో..



నకిరేకల్ : అన్నదానంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



నల్లగొండ : మానస రెసిడెన్సీలో పూజలో పాల్గొన్న భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కనగల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల 2015–16 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కనగల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఓ బండారి స్వప్న, ఉపాధ్యాయులు గుమ్మల మంజుల, ప్రజ్వల, రమావత్ ఝాన్సీ రాణి, రమ, ధనమ్మ, వనిత, నాగలక్ష్మి, సునీత, సంతోషి, పూర్వ విద్యార్థులు నీలకంఠం మహేశ్వరి, భార్గవి, వరలక్ష్మి, సౌజన్య, అంజలి, రేణుక, గౌతమి, సంతోష, మౌనిక పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన

నకిరేకల్ : సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ సూచించారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో ఎస్‌డీఎఫ్ కింద రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. , దశలవారీగా మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను పూర్తి చేస్తామన్నారు.

వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

నాంపల్లి: మండలంలోని పసునూరు గ్రామంలో పెద్ద చెరువు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వాసిపాక ముత్తిలింగం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పసునూరు పెద్ద చెరువు వాగును ఆయన పరిశీలించి మాట్లాడారు. బ్రిడ్జి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రైతులు ఆకారం కాశయ్య, చెట్టిపల్లి నరసింహ, వెంకట్‌రెడ్డి, చెట్టిపల్లి మాసయ్య, అయ్యన్న పాల్గొన్నారు.

‘మాలలకు అన్యాయం చేసిన కాంగ్రెస్’

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఎస్సీ వర్గీకరణ చేసి మాలలకు తీరని అన్యాయం చేసిందని మాల సంఘాల జేఏసీ చైర్మన్ గోలి సైదులు, జిల్లా అధ్యక్షుడు అద్దంకి రవి, కూన యాదయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. మాలల హక్కులకు మాల ప్రజాప్రతినిధులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

పురస్కారం అందుకున్న శ్రీను



పురస్కారం అందుకుంటున్న గంటెపాక శ్రీను

చిట్యాల: మున్సిపాలిటీకి చెందిన డాక్టర్ గంటెపాక శ్రీనుకు గుంటూరులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమానికి మాజీ ఎంఎల్‌సీ కె.ఎస్.లక్ష్మణ్‌రావు, చలపతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ అధిపతి వై.వి.ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై శ్రీనుకు పురస్కారాన్ని అందజేశారు.

బహుమతులు అందజేత

నల్లగొండ టూటౌన్: బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారుడు జనంపల్లి ప్రేమయ్య మెమోరియల్ వన్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆదివారం నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎనుగుల రాకేష్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనంపల్లి ప్రేమయ్య ఫౌండేషన్ సెక్రటరీ జాన్ ప్రేమ్, ఫౌండేషన్ సభ్యులు సామ్యూల్, ప్రభుచరణ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, కాలనీవాసులు

నల్లగొండ : పట్టణంలోని అలకాపురి కాలనీలో రివర్ నిమ్స్ ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో థైరాయిడ్, ఎముకల సాంద్రత, ఈసీజీ, టూడీ ఈకో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అలకాపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుడిపాటి హరినారాయణ ,ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, కోశాధికారి బ్రహ్మణాచారి, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డా.ఆసియా, మాజీ కౌన్సిలర్ సలీం, ప్రదీప్, ప్రసాద్, శివ, వికాస్, జీవన్, కిశోర్, కిరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.